
33వ డివిజన్‌లో తరలివచ్చిన జనం


మాట్లాడుతున్న మంత్రి గంగుల, పక్కన మేయర్ సునీల్‌రావు

# అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- ఎన్నికల తర్వాత కనిపించని నాయకులకు బుద్ధి చెప్పండి
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని 33, 34, 35వ డివిజన్లలో ప్రచారం

కార్పొరేషన్, నవంబర్ 14: పదేళ్లలో నగరంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పార్టీ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ప్రజలను కోరారు. నగరంలోని 33, 34, 35వ డివిజన్లలో మంగళవారం సాయంత్రం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ శ్రేణులు మంత్రిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ, ఈ పదేళ్ల కాలంలో నగరాభివృద్ధి కోసం వేల కోట్ల నిధులు తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. రోడ్లన్నీ ఎంత సుందరంగా మారాయో ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు. నగరంలో ఎక్కడా కూడా మట్టి రోడ్లు కనిపించకుండా అభివృద్ధి చేశామన్నారు. తెలంగాణను చూసి ఈర్ష్య పెంచుకున్న ఆంధ్రా నాయకులు ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీల ముసుగులో హైదరాబాద్‌లో అడ్డా వేశారని విమర్శించారు. కేసీఆర్‌ను ఈ ఎన్నికల్లో ఓడించి హైదరాబాద్ సంపదను దోచుకుందామని చూస్తున్నారని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తెలంగాణ కుక్కలు చింపిన విస్తరి అవుతుందని పేర్కొన్నారు. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణను ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఈ నాలుగున్నర ఏండ్లలో ఏ రోజైనా ప్రజల వద్దకు వచ్చారా అని ప్రశ్నించారు. స్మార్ట్‌సిటీ వచ్చినప్పుడు సంజయ్ కార్పొరేటర్‌గా ఉన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు తన వల్లే స్మార్ట్‌సిటీ వచ్చిందని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వచ్చే ఇలాంటి నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఓ రౌడీషీటర్‌కు టికెట్ ఇచ్చిందన్నారు. సర్పంచ్‌గా ఉంటేనే 32 కేసులు నమోదైతే, ఇక ఎమ్మెల్యే అయితే ఎన్ని వందల కేసులు నమోదవుతాయో ఆలోచించాలన్నారు. అలాంటి వ్యక్తులను గెలిపిస్తే ప్రజల భూములు మిగులుతాయా అని ప్రశ్నించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి వేగంగా పూర్తి కావాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, బర్కత్‌అలీ, మాజీ కార్పొరేటర్ చీటి రామారావు, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తెలంగాణ ఆగమవుతది



కాంగ్రెస్ చెబుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మి వారికి ఓటు వేస్తే తెలంగాణ రాష్ట్రం ఆగం అవుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. బండి సంజయ్‌కి స్మార్ట్‌సిటీ సాధించిన విషయంలో ఎలాంటి సంబంధం ఉందని ప్రశ్నించారు. అర్హత లేకున్న కూడా సీఎం కేసీఆర్ అనుమతితో అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు చుట్టు తిరిగి వారిని ఒప్పించి కరీంనగర్ స్మార్ట్‌సిటీని తీసుకువచ్చినట్లు తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అనేక విషయాల్లో అనుమతులు, ఇతర వాటిని సాధించుకున్నామని పేర్కొన్నారు. మరి ఇప్పటి ఎంపీ ఏం సాధించారని నిలదీశారు. స్మార్ట్‌సిటీ నిధులతో మంత్రి గంగుల కమలాకర్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. తెలంగాణలో పదేళ్లలో జరిగిన అభివృద్ధి విషయమై ప్రతి ఒక్కరూ చర్చ పెట్టాల్సినా అవసరం ఉందన్నారు.

- వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు

# ఆశీర్వదించండి మరింత అభివృద్ధి చేస్తా


వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- హుస్నాబాద్ పట్టణంలోని 2, 7, 14, 17వ వార్డుల్లో ప్రచారం

హుస్నాబాద్, నవంబర్ 14: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే కరువుకు వెల్‌కమ్ చెప్పినట్లే అవుతుందని బీఆర్ఎస్ హుస్నాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 2, 7, 14, 17వ వార్డుల్లో మంగళవారం ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్యేకు మహిళలు అడుగడుగునా మంగళహారతులు, పూలమాలలు, జై తెలంగాణ నినాదాలతో స్వాగతం పలికారు. అనంతరం రెడ్డి కాలనీలో జరిగిన రోడ్‌షోలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ, కరీంనగర్‌లో మూడు సార్లు ప్రజలు తిరస్కరించిన నాయకుడు హుస్నాబాద్‌కు వచ్చి అభివృద్ధి చేస్తానని చెబితే నమ్మడానికి ఇక్కడి ప్రజలు అమాయకులు కాదన్నారు. ఎక్కడి నుంచో వచ్చి మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకునే వాళ్లను నమ్మితే మోసపోతారని ప్రజలకు సూచించారు. హుస్నాబాద్ ప్రస్తుతం విద్య, వైద్యం, వ్యాపారం, వాణిజ్యంలో దూసుకుపోతున్నదని చెప్పారు. అర్హులందరికీ గృహలక్ష్మి, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. హుస్నాబాద్‌లో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి తనను ఆశీర్వదించి, గెలిపించాలని ప్రజలను కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎండీ అన్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టి గోపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్ బోజు రమారవీందర్, నాయకులు విజయ భాస్కర్, లక్ష్మణ్‌నాయక్, బాషవేని రాజయ్య, యాటకార్ల స్వరూప, చిరంజీవి, వికాస్‌యాదవ్, ఆయా వార్డుల బీఆర్ఎస్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ సభ్యులు ముప్పిడి రాజిరెడ్డి, భూపతిరెడ్డి, పున్న రాజమౌళి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీ రజినికి వినోద్ పరామర్శ


రజినిని పరామర్శిస్తున్న బోయినపల్లి వినోద్ కుమార్

కోనరావుపేట, నవంబర్ 14: వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేసి తిరిగి ఇంటికి ద్విచక్ర వాహనం వెళ్తున్న కోనరావుపేట మాజీ ఎంపీపీ రజిని రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో ఆమె కరీంనగర్‌లోని సిటీ దవాఖానలో చికిత్స పొందుతుండగా, మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ పరామర్శించారు. అధైర్య పడొద్దని, తామున్నామని భరోసానిచ్చారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

# బీఆర్ఎస్ జోష్‌కు ప్రతిపక్షాలు బేజారు


మధురానగర్‌లో ప్రచారంలో భాగంగా ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

- కాంగ్రెస్‌ను నమ్మితే అరిగోస పడుతం
- కడుపులో పెట్టుకుని కాపాడుకునే నాయకుడు కేసీఆర్
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- గంగాధర మండలంలో ప్రచారం

గంగాధర, నవంబర్ 14: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ జోష్‌ను చూసి ప్రతిపక్షాలు బేజారవుతున్నాయని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎద్దేవా చేశారు. మండలంలోని మధురానగర్, గంగాధర గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కాంగ్రెసోళ్లకు కండ్లు మండుతున్నయని, బీజేపోళ్లకు కడుపులుడుకుతున్నయని పేర్కొన్నారు. మధురానగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. చౌరస్తాకు ఇరువైపులా డబుల్ రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. గంగాధరను మున్సిపాలిటీగా మార్చుతామన్నారు. మధురానగర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మహిళల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తామన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే బీఆర్ఎస్ కావాలా, స్కాములు చేసే కాంగ్రెస్ పార్టీ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్ రెడ్డి రైతు బంధును ఆపాలని ఈసీకి లేఖ రాశాడని దుయ్యబట్టారు. ఎన్నికలు ముగిసిన వెంటనే అర్హులందరికీ గృహలక్ష్మి, బీసీ బంధు అందజేస్తామన్నారు. ప్రజలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని తెలిపారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ఎంపీపీ శ్రీరాం మధుకర్, సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సామంతుల శ్రీనివాస్, సర్పంచులు వేముల లావణ్య-అంజి, మడ్లపెల్లి గంగాధర్, కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, జోగు లక్ష్మీరాజం, నాయకులు ఆకుల మధుసూదన్, రామిడి సురేందర్, రేండ్ల శ్రీనివాస్, వంగల మల్లికార్జున్, మడ్డపెల్లి శ్రీనివాస్, రమేశ్, సురేశ్, గంగాధర్, తిరుపతి, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# రసమయి బాలకిషన్‌కే మా మద్దతు


ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు మద్దతు తెలిపి సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

గన్నేరువరం, నవంబర్14: మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాగా, అన్ని కుల సంఘాల వారు రసమయి బాలకిషన్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ముదిరాజ్, రజక, పద్మశాలీ, మాల, కుమ్మరి, యాదవ సంఘాలకు 300 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## చెక్ పోస్ట్ తనిఖీ

రాంనగర్, నవంబర్ 14: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పద్మనగర్ బైపాస్ రోడ్ వద్ద గల చెక్ పోస్ట్ ను మంగళవారం సీపీ అభిషేక్ మహంతి తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహన తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ తరలింపును గుర్తిస్తే సీజ్ చేసే సమయంలో వీడియోగ్రఫీ చేయించాలన్నారు.